సాక్షి
తిరుపతి

ఆదివారం । 10 । ఆగస్టు । 2025



గీత దాటిన వెటర్నరీ వీసీ

శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీ హద్దులు దాటి వ్యవహరిస్తున్నారు. - 8లో



సేద్యం.. సంక్షోభం

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రైతులకు వ్యవసాయం కలిసి రాలేదు. గిట్టుబాటు దక్కక నష్టపోయి, సేద్యం విరమించుకుంటున్నారు. - 8లో



మోదీ కనుసన్నల్లో..

రాజ్యాంగ సంస్థలు మోదీ కనుసన్నల్లో వ్యవహరిస్తున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. - 8లో

న్యూస్‌రీల్

12న వెంకటగిరిలో జాబ్‌మేళా

తిరుపతి అర్బన్: వెంకటగిరిలోని విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 12వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని వెల్లడించారు. ఐదో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, పీజీ తదితరులు అర్హులుగా పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు వచ్చే వారు ఈ నెల 10వ తేదీ వరకు తమ పేరును రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వీలుందని తెలిపారు. అదనపు సమాచారం కోసం 70135 09543, 94914 58910, 99888 53335 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 26 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 70,480 మంది స్వామివారిని దర్శించుకోగా 28,923 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.17 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో కి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించబోరని స్పష్టం చేసింది.

ఆశ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి తుడా: ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు తిరుపతి జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ పథకం కింద పలు పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ పరిధిలో 27 ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య శాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. వయస్సు 25 నుంచి 45 ఏళ్లలోపు ఉన్న మహిళా అభ్యర్థులు ఈనెల 16వ తేదీ లోపు తమ పరిధిలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లకు దరఖాస్తులను అందజేయాలని కోరారు.

స్పోర్ట్స్ కోటా డీఎస్సీ పోస్టుల ప్రాథమిక జాబితా విడుదల

తిరుపతి సిటీ: మెగా డీఎస్సీలో క్రీడా కోటా ఉపాధ్యాయ పోస్టుల ప్రాథమిక జాబితాను శాప్ అధికారులు వెబ్‌సైట్‌లో ఉంచారు. జిల్లాలో స్పోర్ట్స్ కోటా కింద ఎంపికైన అభ్యర్థులు శాప్ విడుదల చేసిన జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 13వ తేదీ అర్ధరాత్రి 12 గంటల్లోపు తమ అభ్యంతరాలను తెలియజేయాల్సి ఉంటుంది. అభ్యంతరాలు పరిష్కరించిన అనంతరం తుది జాబితాను విద్యాశాఖకు పంపనున్నారు. ఇప్పటికే డీఎస్సీ క్రీడా కోటా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తైన విషయం తెలిసిందే.

తిరునగరిపై కాలకూటం

ఆధ్యాత్మికథామం.. నిత్యం వెంకన్న నామ స్మరణం.. మిన్నంటే భక్తి భావం.. కీర్తి విశ్వవ్యాప్తం.. ఇది తిరుపతి నాణేనికి ఒక పార్శ్వం.. మరో వైపు చూస్తే దందాలు..దౌర్జన్యాలు.. కబ్జాలు.. బడుగుబలహీన వర్గాలకు బెదిరింపులు.. రోజువారీ మా మూళ్ల వసూళ్లు.. ఇవ్వకుంటే దాదాగిరి.. అడ్డొస్తే అక్రమ కేసులు.. దాడులు.. వెరసి తిరునగరిని ఏడాదిగా 'కాలకూటం' కబళిస్తోంది. ఫలితం.. చిరువ్యాపారులు, మధ్యతరగతి ప్రజలు.. పేదల జీవితాలు రోడ్డు పాలవుతున్నాయి.



బొంతాలమ్మ ఆలయం వద్ద కూటమి నేతలు తొలగించిన చిరు వ్యాపారుల దుకాణాలు (ఫైల్)

ఆధ్యాత్మిక నగరంలో కూటమి అరాచకాలు!

- తిరునగరిలో దందాలు.. దౌర్జన్యాలు
- ఫుట్‌పాత్ వ్యాపారుల నుంచి మామూళ్ల వసూలు
- మామూళ్లు ఇవ్వకుంటే అక్రమం అంటూ తొలగింపులు
- తిరుపతిలో ఏడాదిగా కొనసాగుతున్న కూటమి ఆగడాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో కూటమి నేతల ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. వివాదాస్పద స్థలాలు, ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలే లక్ష్యంగా రెచ్చిపోతున్నారు. మరో వైపు నగరంలోని చిరు వ్యాపారుల నుంచి రోజూ మామూళ్లు వసూలు చేసుకుంటున్నారు. కూటమి నేతలను ఎవరైనా ఎదిరిస్తే వారిపై దాడులు చేయడం, అక్రమ కేసులు బనాయించడం వంటివి చేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ప్రభుత్వాధికారులు తమ మాట వినికపోతే వారిపైనా దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. నగరంలో ఏడాదిగా చోటు చేసుకుంటున్న సంఘటనలే ఇందుకు నిదర్శనం. అందులో మచ్చుకు కొన్ని..

- చంద్రగిరి నియోజక వర్గానికి చెందిన ఓ మహిళ తన కుమారుడు ఇచ్చిన నగదు, గ్రామంలో ఉన్న వ్యవసాయ భూమిని విక్రయించి తిరుపతి- తిరుచానూరు మార్గంలో 30 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ స్థలంలో సుందరమైన నివాసాన్ని నిర్మించుకోవాలని భావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జనసేనకు చెందిన ఓ నాయకుడు ఆ స్థలంపై కన్నేశాడు. కొన్ని తప్పుడు పత్రాలు సృష్టించి ఆ స్థలాన్ని ఆక్రమించాడని బాధితురాలు సీఎం చంద్రబాబు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్థలం వద్దకు వెళ్లి అడ్డుకుంటే చంపేస్తానంటూ బెదిరించినట్లు ఆమె కన్నీరుమున్నీరవుతున్నారు. తనకు న్యాయం చేయాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేస్తోంది.
- తిరుపతి 8వ డివిజన్ సంజయ్‌గాంధీ కాలనీ పరిధిలో మధ్యతరగతికి చెందిన రంగయ్య, జయలక్ష్మి కూలీనాలీ చేసి దాచుకున్న డబ్బుతో రెండేళ్ల క్రితం పాత ఇంటిని కొనుగోలు చేసుకున్నారు. రూ.9 లక్షలతో కొనుగోలు చేసిన స్థలంపై జనసేనకు చెందిన కార్పొరేటర్ కన్ను పడింది. దీంతో ఆ కుటుంబాన్ని చిత్ర హింసలకు గురిచేస్తున్నాడు. వెంటనే ఖాళీ చేయాలని లేదంటే చంపేస్తామంటూ బెదిరించినట్లు బాధిత కుటుంబం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఖాళీ చేయకపోవడంతో అప్పుడప్పుడు కొందరు ఆ కుటుంబంపై దౌర్జన్యానికి దిగుతున్నట్లు సమాచారం.
- ఆధ్యాత్మిక నగరంగా పేరొందిన తిరునగరికి రోజూ వేలాది మంది భక్తులు, పర్యాటకులు వచ్చి వెళుతుంటారు. నగర ప్రజల అవసరాలు, భక్తులు, పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుపతిలో చిరువ్యాపారులు తోపుడుబండ్లపై తినుబండారాలు, పండ్లు, పూలు, కూరగాయలు విక్రయిస్తున్న విషయం తెలిసిందే. తిరుపతి నగరంలో మార్కెట్లను టెండర్ ద్వారా దక్కించుకున్న వ్యక్తి పేరు చెప్పి కొందరు కూటమి నేతలు చిరు వ్యాపారుల నుంచి రోజూ రూ.100 నుంచి రూ.వెయ్యి చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ విషయం గురించి తెలుసుకున్న కార్పొరేషన్ కమిషనర్ గతంలో అధికార ప్రకటన చేశారు. నగరంలో తోపుడుబండ్లు, పండ్లు, పూలు విక్రయించే వారి నుంచి వసూలు చేయడానికి వీల్లేదని హెచ్చరికలు జారీ చేశారు. అయినా ఆ కాంట్రాక్టర్ పేరు చెప్పి రోజూ వసూలు చేస్తున్నట్లు చిరువ్యాపారులు చెబుతున్నారు. కూటమి నేతలు అడిగినంత ఇవ్వకపోతే చిరు వ్యాపారులపై దౌర్జన్యం చేసి, అక్కడి నుంచి తరిమేస్తున్న సంఘటనలు తిరుపతి నగరంలో జగజ్జీవన్ పార్కు, బొంతాలమ్మ ఆలయం వద్ద చోటు చేసుకున్న ఘటనలే ఇందుకు నిదర్శనం.
- కూటమి అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే మున్సిపల్ పార్కు ఎదురుగా ఉన్న తన స్థలాన్ని కాపాడుకునేందుకు టీడీపీ నేత అన్నా రామచంద్రయ్య ఓ భవనాన్ని కూల్చేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అది సాధ్యం కాకపోవడంతో భవన యజమాని నివాసానికి వెళ్లి దాడి చేసిన ఘటన నాడు కలకలం రేపింది.

- తిరుపతి టౌన్ బ్యాంక్‌లో అకౌంటెంట్‌గా పని చేస్తున్న కే రోహిణికు మార్ 2023లో రెండు వేల నోట్ల మార్పు విషయంలో అవకతవకలకు పాల్పడ్డారంటూ డిపాజిట్ దారుల ఫిర్యాదు మేరకు క్రమశిక్షణ చర్యలో భాగంగా సర్వీసు నుంచి తొలగించారు. అయితే తనకు న్యాయస్థానం తిరిగి విధుల్లో చేరమని ఆదేశాలిచ్చిందని మూడు నెలల కిందట టీడీపీ నేతలతో కలిసి టౌన్‌బ్యాంక్‌లోకి చొరబడి ఎండీ శివకుమార్‌పై దౌర్జన్యానికి పాల్పడ్డారు. తిరుపతి కార్పొరేషన్‌లో అధికారిక సమావేశంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్న కుమారుడు ఆరణి శివకుమార్ ఎటువంటి పదవి, హోదా లేకపోయినా పాల్గొన్నారు. అంతటితో ఆగకుండా అధికారులకు ఆదేశాలు ఇవ్వటం గమనార్హం.



తిరుపతి టౌన్‌బ్యాంక్ ఎండీ శివకుమార్ చాంబర్‌లో ఆ బ్యాంక్ మాజీ చైర్మన్ పులిగోరు మురళీకృష్ణారెడ్డి, జేబీ శ్రీనివాస్, ఆర్సీ మునికృష్ణ (ఫైల్)

- తిరుపతి ఒకటో డివిజన్ తిమ్మినాయుడుపాళెం సమీపంలోని మిట్టూరులో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో ముందుగా మా ఇంటి నుంచే స్వామి వారి ఊరేగింపు వెళ్లాలంటూ టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ నాయకులతో వాగ్వివాదం చేసి దాడులకు తెగబడ్డారు. టీడీపీ నాయకుల దాడిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటమునిరెడ్డి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చేరారు.



టీడీపీ నేతల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నేత వెంకటముని(ఫైల్)

- తిరుపతి అర్బన్ పరిధిలోని తిమ్మినాయుడుపాళెం హరిజనవాడ శ్మశాన స్థలం 1.45 ఎకరాలను కూటమి నేతలు ఆక్రమించారు. శ్మశాన స్థలం కోసం పోరాటం చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ అనిల్‌కుమార్‌పై ఇటీవల దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన తెలిసిందే. శ్మశాన స్థలంలో కూటమి నేతలు నివాసాలు నిర్మించుకున్నా ఎవరూ పట్టించుకునే నాథుడే కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడినా ఇప్పటి వరకు ఎవరిపైనా కేసు నమోదు చేయకపోవటం గమనార్హం.



టీడీపీ గూండాల దాడిలో గాయపడిన 50వ డివిజన్ కార్పొరేటర్ బోకం అనిల్‌కుమార్ (ఫైల్)



తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో కూటమి నేతల విధ్వంసం(ఫైల్)

బెయిల్ కోసం..



రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని ఆకాంక్షిస్తూ రాజనాల బండలో 101 కొబ్బరి కాయలు కొడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు - చౌడేపల్లి

విద్యాలయాల్లోకి విద్యార్థి సంఘాల నియంత్రణ దుర్మార్గం

తిరుపతి కల్చరల్: విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘాల ప్రవేశం రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గమని, ఈ ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని పలు విద్యార్థి సంఘాల నేతలు స్పష్టం చేశాయి. జిల్లాలోని అన్ని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం వేమన విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నేతలు అక్బర్, ప్రవీణ్, పీడీఎస్ఓ స్రవంతి, పీడీఎస్‌యూ నేత లోకేష్, ఎన్ఎస్‌యూఐ నేత మల్లికార్జున పాల్గొని ప్రసంగించారు. పాఠశాల, ఇంటర్మీడియట్ కమిషనర్లు విడుదల చేసిన ఈ ఉత్తర్వులు చూస్తే కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా దోపిడీ చేసుకోండి.. మీకు అడ్డు పడే విద్యార్థి సంఘాలను మేము అడ్డుకుంటాం అనేలా ఉన్నాయన్నారు. రాజ్యాంగ హక్కులను కాలరాసేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని, తక్షణమే ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సోమవారం విద్యాశాఖ మంత్రి దిష్టిబొమ్మ దగ్ధంతో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు శివ, బాలాజీ, అశోక్‌కుమార్, ప్రకాష్, రంజిత్, సుందర్ పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న విద్యార్థి సంఘాల నేతలు

పేరు గొప్ప..ఊరు దిబ్బ!

- స్వచ్ఛత లేని అవార్డులెందుకు?
- నగరంలో కంపు కొడుతున్న చెత్తకుప్పలు
- పారిశుద్ధ్య లోపంపై భూమన అభినయ్ రెడ్డి ఆగ్రహం

తిరుపతి మంగళం : ఆధ్యాత్మిక తిరునగరి పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా మారిందని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి అన్నారు. తిరుపతి 44వ డివిజన్ సుందరయ్యనగర్‌లో గుట్టలు గుట్టలుగా పడవేసిన చెత్తకుప్పల వద్ద శనివారం జోరు వానలో పార్టీ శ్రేణులతో కలిసి భూమన అభినయ్‌రెడ్డి నిరసన చేపట్టారు. ఇదేనా తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో స్వచ్ఛత అని, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పేరు తప్ప స్వచ్ఛత ఎక్కడ ఉందని భూమన అభినయ్‌రెడ్డి ప్రశ్నించారు. స్వచ్ఛత లేని అవార్డులెందుకన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తిరుపతి నగర అభివృద్ధితోపాటు పారిశుద్ధ్యాన్ని గాలికి వదిలేశారని మండిపడ్డారు. ప్రపంచ నలుమూలల నుంచి శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు తిరుపతిలో దిగగానే చెత్త కుప్పల నుంచి వచ్చే దుర్గంధం, బార్లా తెరిచిన మద్యం దుకాణాలు, ఎక్కడ చూసినా తాగి పడిపోయిన మందుబాబులే దర్శనమిస్తున్నారన్నారు. తిరుపతిలో ఏ వార్డుకు వెళ్లినా రోడ్లపై గుట్టలుగా కనిపించే చెత్త కుప్పలు, మురుగుకాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలే తప్ప పరిశుభ్రత ఎక్కడ ఉందని ప్రశ్నించారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో తిరుపతి ఆధ్యాత్మిక నగర పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు కార్పొరేషన్‌లో ఉన్న పారిశుద్ధ్య కార్మికులే కాకుండా టీటీడీ సహకారంతో మరో రెండు వేలమంది కార్మికులను నియమింపజేసేందుకు అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అయితే తిరుమల ఆధ్యాత్మికతను, తిరుపతిని ఉద్ధరించడానికి కంకణం కట్టుకున్న అవతార పురుషులు, పదవులు అనుభవించడం తప్ప అభివృద్ధి పట్టని బీజేపీ నాయకుడు భానుప్రకాష్‌రెడ్డి అడ్డుపడడం జరిగిందన్నారు. తిరుపతి అభివృద్ధి చేయడం, పరిశుభ్రతను పట్టించుకోని అతనికి అడ్డుకునేందుకు అర్హత ఉందా? అని ప్రశ్నించారు. ఆ రోజు భానుప్రకాష్‌రెడ్డి అడ్డుకోకపోతే పరిశుభ్రతలో తిరుపతి నగరం ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలిచేదన్నారు. ఆ రోజు అభివృద్ధిని అడ్డుకున్న కూటమి నేతలు ఈ రోజుల అధికారంలో ఉన్నారు కదా.. ఎందుకు అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణపై శ్రద్ధ చూపడం లేదన్నారు. టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్, డైరెక్టర్ పోలిరెడ్డి నాగిరెడ్డి, కార్పొరేటర్ తమ్ముడు గణేష్, పార్టీ యువజన విభాగం నాయకులు ఉదయ్‌వంశీ, మల్లం రవికుమార్‌రెడ్డి, దినేష్‌రాయల్, పార్టీ నాయకులు రాజా, అశోక్ కుమార్‌రెడ్డి, యోగాంజనేయరెడ్డి, లల్లీ వెంకటేష్, షేక్ ఇమ్రాన్‌బాషా, తలారి రాజేంద్ర, రమణారెడ్డి, రాపూరి ప్రసాద్, రుద్రగోపి, సాయికుమారి, గోలి విజయలక్ష్మి, పద్మజ, రాధ, ముస్తఫా, గోవిందరెడ్డి, స్వరూప్, కోదండ, ఆటో ప్రసాద్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్యనగర్, మధురానగర్లోని దోబీఘాట్ రోడ్డుపై పేరుకుపోయిన చెత్త కుప్పలను పరిశీలిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి, పార్టీ శ్రేణులు



పొంగిపొర్లుతున్న మురుగుకాలువను పరిశీలిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

ప్రపంచంలో గిరిజనులకు ప్రత్యేకస్థానం

తిరుపతి కల్చరల్: ప్రత్యేకమైన కట్టుబాట్లు, ఆచారాలు, ప్రకృతి సిద్ధమైన అలవాట్లు కలిగిన గిరిజనులకు ప్రపంచంలో ఒక ప్రత్యేకస్థానం ఉందని, సమాజంలో ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేది విద్య ఒక్కటేనని, ఆ దిశగా గిరిజనులు ముందడుగు వేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం బైరాగిపట్టెడలోని గిరిజన భవన్‌లో ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మారుతున్న పరిస్థితుల్లో వేగవంతమైన ప్రపంచంలో ఇవన్నీ నేడు కూడా ఉండడం విశేషమన్నారు. లంబాడీ, బంజారా, థిమ్‌సా వంటివి ఉన్నాయని తెలిపారు. గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. తిరుపతిలో గిరిజన బాలికల రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి రూ.3.50 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. గిరిజన భవన మరమ్మతులు, నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి ఈనెలాఖరులోపు రూ.20 లక్షలు మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామని, తుడా చైర్మన్, కార్పొరేషన్ వారితో మాట్లాడి అదనంగా రూ.10 లక్షలు మంజూరు కోరనున్నట్లు తెలిపారు. హస్తకళా కార్పొరేషన్ అభివృద్ధి చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖాధికారి రాజా సోము, గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణ, బంజార సంఘం అధ్యక్షుడు మల్లికార్జున, యానాది సంఘం, గిరిజన సంఘం నేతలు వసంతమ్మ, సుమన్, రిటైర్డ్ డీఎఫ్ఓ భాస్కర్, గిరిజన నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మో..జన సేనాని

- గంజాయి కేసులో ప్రధాన నిందితుడిగా గుర్తింపు
- గతంలో పలు వివాదాల్లో ఫిర్యాదులు





జనసేన ఎమ్మెల్సీ నాగబాబుతో నయిాం, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌తో (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత జన సైనికులు తమకు ఎదురే లేదనేలా వ్యవహరిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు తెర లేపుతున్నారు. ఇందులో భాగంగానే గూడూరు పట్టణంలో జనసేనకు చెందిన ఓ నాయకుడు తన దుకాణం పక్కనే ఉన్న మెడికల్ షాపును ఖాళీ చేయించేందుకు తాను చేస్తున్న గంజాయి వ్యాపారాన్ని మెడికల్ షాపు వారు చేస్తున్నట్లు పోలీసులను నమ్మించే ప్రయత్నం చేసి పప్పులో కాలేశాడు. పోలీసుల విచారణలో జనసేన నాయకుడే ప్రధాన నిందితుడని గుర్తించారు. వివరాలాలా వున్నాయి. గూడూరు ఆస్పత్రి రోడ్డులో ఉన్న ఓ మెడికల్ షాపులో బుధవారం డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు మెడికల్ షాపు పక్కనే ఉన్న సందులో దాడులు చేసి అక్కడ ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న కొన్ని చిన్న ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అతను చెప్పిన వివరాలతో మరొకరిని అదుపులోకి తీసుకుని ఇద్దరినీ విచారించారు. తమ వద్ద గంజాయి వ్యాపారం చేయించేది జనసేన పార్టీకి చెందిన నయిాం అని పోలీసులకు చెప్పారు. దీంతో పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పట్టుబడిన ఇద్దరు యువకులతోపాటు నయిాం, సబీల్ అనే యువకులపై కేసు నమోదు చేశారు.

ప్రాణహాని ఉందన్న మెడికల్ షాపు యజమానులు

జనసేన నాయకుడు నయిాం నుంచి తమకు ఎప్పటికైనా ప్రాణహాని ఉందని మెడికల్ షాపు యజమానులు శనివారం విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దుకాణం ఖాళీ చేయాలని పలుమార్లు తమపై ఒత్తిడి తెచ్చాడని, అందుకు తాము అంగీకరించక పోవడంతో తమ షాపులో డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు చెప్పించి, కేసులో ఇరికించే ప్రయత్నం చేశాడని చెప్పారు.

జనసేనలో నయిాం చురుకైన వ్యక్తి

గూడూరులో జనసేన పార్టీకి గుర్తింపు తీసుకుచ్చేలా నయిాం చురుగ్గా వ్యవహరించే వాడు. ఆస్పత్రి రోడ్డులో ఉన్న తన టూల్స్ వ్యాపారంతోపాటు గంజాయి బయట ప్రాంతాల నుంచి తెప్పించి విక్రయించేవాడు. యువతను ఆకట్టుకుని పలు వివాదాల్లో తల దూర్చేవాడు. స్థానికంగా ఉన్న కూటమి నాయకులతో కార్యక్రమాలను చేపట్టడంతో గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇటీవల కాలంలో పలు వివాదాల్లో అతనిపై రూరల్, ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లలో పలు ఫిర్యాదులున్నాయి. పూర్తిస్థాయిలో పోలీసులు పట్టించుకోకుండా వదిలేయడంతోనే ఇలా విచ్చలవిడిగా గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం గంజాయి నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు నయిాంను అరెస్టు చేసేందుకు పోలీసులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు.

క్లుప్తంగా

ఉపాధి కూలీల హక్కులపై అవగాహన


శానంబట్లలో ర్యాలీ చేస్తున్న అధికారులు

చంద్రగిరి: ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న కూలీలు తమ హక్కులను తెలుసుకోవాలని ఎస్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ శ్రీకాంత్ అన్నారు. శనివారం మండలంలోని శానంబట్ల గ్రామంలో ఉపాధి సిబ్బంది ర్యాలీ చేశారు. అనంతరం ఉపాధి కూలీలకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రతి ఉపాధి కూలీ ఏడాదికి 100 రోజులు తప్పనిసరిగా పనులు కల్పించుకోవాలన్నారు. ప్రతి రోజూ దినసరి కూలీ రూ.307గా కేంద్ర ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. అలాగే కూలీలు పనిచేసే ప్రాంతంలో వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలను కోరడం మీ హక్కు అని, అత్యవసర సమయంలో కావాల్సిన మెడికల్ కిట్‌ను కూడా అధికారులను అడిగి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం భార్గవి, ఉపాధి సోషల్ ఆడిట్ ఎస్ఆర్పీలు కన్నారెడ్డి, మూర్తి, డీఆర్పీలు సుబ్రమణ్యం, సుబ్బరాయుడు, రవీంద్ర, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో గూడూరు క్రీడాకారుడి ప్రతిభ


విజేతలతో సాయికుమార్(కుడి వైపున మొదటి వ్యక్తి)

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని కరణాలవీధికి చెందిన చెయ్యూనూరు సాయికుమార్ అట్లాంటాలో జరుగుతున్న జార్జియా స్టేట్ గేమ్స్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో స్వర్ణ, కాంస్య పతకాలను సొంతం చేసుకున్నట్లు శనివారం అక్కడ నుంచి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అమెరికాలోని అట్లాంటా నగరంలోని జార్జియా జరుగుతున్న స్టేట్ గేమ్స్ –2025 బ్యాడ్మింట్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని రెండు విభాగాల్లో పతకాలు సొంతం చేసుకున్నట్లు తెలిపారు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో అమెరికాకు చెందిన అనన్యా కోలిపాకతో కలసి స్వర్ణ పతకం సొంతం చేసుకున్నాడు. అలాగే మెన్స్ డబుల్స్ విభాగంలో కూడా కాంస్య పతకం సాధించినట్లు ఆయన తెలిపారు.

కలెక్టరేట్ 'మద్య' రచ్చ

–పార్కింగ్ ప్రదేశంలో...మద్యం సీసాలు


కలెక్టరేట్‌లోని పార్కింగ్ ప్రదేశంలో మద్యం సీసాలు

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లోని పార్కింగ్ ప్రదేశంలో మద్యం సీసాలు ఎక్కడ చూసినా దర్శనమిస్తున్నాయి. వాహనాలు పార్కింగ్ చేయాల్సిన ఉద్యోగులు మాత్రమే కలెక్టరేట్‌లోని అండర్ గ్రౌండ్‌లో ఉన్న పార్కింగ్ ప్రదేశంలో తమ స్కూటర్లు, కార్లు పార్కింగ్ చేస్తుంటారు. అయితే అక్కడ మద్యం సీసాలు ఒకటి కాదు రెండు కాదు పదుల సంఖ్యలో కనిపిస్తున్నాయి. కలెక్టరేట్‌లో మద్యం సేవించకుంటే బాటిళ్లు ఆ ప్రాంతంలో ఎలా వచ్చాయని వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు విమర్శిస్తున్నారు. మరోవైపు సెలవు రోజుల్లో మద్యాన్ని ఆ ప్రాంతంలో సేవిస్తున్నారా? సాధారణ రోజుల్లోనూ సేవిస్తున్నారా? ఎవరు సేవిస్తుంటారు..ఉద్యోగులా.. లేదా బయట వ్యక్తులా..? ఇలా పలు అనుమానాలు నెలకొంటున్నాయి.

సేద్యం.. సంక్షోభం

దక్కని గిట్టుబాటు..దళారీల పెత్తనం.. అధికారులు, సర్కారు నిర్లక్ష్యం..ఉదాసీనత.. వెరసి ఆరుగాలం చెమటోడ్చి పంట సాగు చేసి అన్నదాతలకు అప్పులు, తిప్పలే మిగులుతున్నాయి. ధరలు లేక.. పంట దిగుబడి విక్రయించలేక..సాగుకు చేసిన అప్పులు తీర్చలేక కర్షకులు కుదేలవుతున్నారు. నాడు పండుగగా ఉన్న వ్యవసాయం నేడు దండగా మారింది. ఫలితంగా పుడమిపుత్రులు సేద్యానికి దూరం అవుతున్నారు.


ఇటీవల రామచంద్రాపురం మండలం గడ్డకిందపల్లిలో మామిడి చెట్లు తొలగించి గోతులు జేసీబీతో పూడ్చిస్తున్న ఓ రైతు

- మొన్న టమాట.. నిన్న మామిడి.. నేడు పట్టు రైతులు
- ఏడాది కాలంలో ఏ ఒక్క పంటకు దక్కని మద్దతు ధర
- ఓ వైపు దళారీల దోపిడీ.. మరోవైపు సర్కారు నిర్లక్ష్యం
- అరకొర పెట్టుబడి సాయం.. అవసరానికి దొరకని ఎరువులు

తిరుపతి రూరల్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని రైతులకు ఈ ఏడాది అంతగా కలిసిరాలేదు. ఒకవైపు ప్రకృతి అనుకూలించినా.. గిట్టుబాటు ధరలు లేకుండా రైతులు నష్టపోయారు. వరి, టమాట, మామిడి పంటల సాగుతోపాటు పట్టు సాగు క్రమంగా కనుమరుగవుతోంది. ఏ పంట పండించినా సరైన గిట్టుబాటు ధర లేదు. దళారీల సిండికేట్‌ను ప్రభుత్వం కట్టడి చేయలేక చేతులెత్తేయడంతో ధరలు గణనీయంగా పడిపోతున్నాయి. దీంతో రైతు లు క్రమంగా వ్యవసాయానికి దూరమవుతున్నారు. మొన్న టమాట రైతులు గిట్టుబాటు ధరలు లేక దిగుబడిని రోడ్లపై పడేస్తే.. నిన్న మామిడి రైతులు పంటను పారేయడంతో పాటు చెట్లను తొలగించేశారు. నేడు పట్టు సాగు రైతులు మల్బరీమొక్కలను తవ్వేస్తున్నారు.

రెండు వేల ఎకరాల నుంచి 500 ఎకరాలకు..

తిరుపతి సుమారు 2 వేల ఎకరాల్లో పట్టుసాగు చేస్తున్నట్టుగా ఆ శాఖ అధికారులు రికార్డుల్లోకి ఎక్కించుకున్నా క్షేత్రస్థాయిలో కేవలం 500 ఎకరాల్లో మాత్రమే పట్టు సాగవుతున్నట్టు సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సుమారు 1500 ఎకరాల్లో పట్టు సాగును రైతులు నిలిపివేసినట్టు తెలుస్తోంది. కేంద్రం పట్టు పరిశ్రమను ప్రోత్సహించేందుకు పలు రాయితీలు ప్రకటిస్తున్నా, వాటిని సక్రమంగా అమలు చేసి, పట్టు రైతులకు లాభాలు తెచ్చి పెట్టాల్సిన మార్కెటింగ్ శాఖలోని ఉన్నతాధికారుల చేతకానితనం, అవినీతితో తమకు ఇలాంటి పరిస్థితులు వస్తున్నాయని పట్టు రైతులు ఆరోపిస్తున్నారు. తాజాగా తిరుపతి రూరల్ మండలం వేమూరుకు చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు అయ్యప్పనాయుడు గత ఏడేళ్లుగా దేశీయ పద్ధతిలో పట్టు సాగు చేస్తున్నాడు. రెండు నెలలుగా పట్టగూళ్లను అమ్ముకోలేక తనకున్న 4 ఎకరాల పట్టు సాగులో 2.50 ఎకరాలు మల్బరీ మొక్కలను జేసీబీతో తొలగించేశారు. దీనికి కారణం గిట్టుబాటు ధర లేకపోవడమేనని చెబుతున్నారు.

జిల్లాలో 'పట్టు' తప్పుతోంది!

ఉమ్మడి చిత్తూరు జిల్లా విభజన తరువాత తిరుపతి జిల్లా పరిధిలో పట్టు సాగు చేసే రైతులను పలమనేరు పట్టు మార్కెట్‌లోని వ్యాపారులు, అధికారులు చులకన భావంతో చూస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. పట్టు గూళ్ల నాణ్యత ఆధారంగా ధరలు నిర్ణయించకుండా లోకల్, నాన్ లోకల్ అన్న తారతమ్యాలు సృష్టించి ధరలు నిర్ణయిస్తుండడంతో నష్టపోతున్నామని రైతులు గగ్గోలు పెడుతున్నారు.


తిరుపతి రూరల్ మండలం వేమూరు వద్ద మల్బరీ మొక్కలను తొలగిస్తున్న జేసీబీ

కిలో రూ.300 నుంచి రూ.450

రెండు నెలలుగా పలమనేరు మార్కెట్‌కు వెళుతున్న పట్టు రైతులకు కిలో పట్టు గూళ్ల ధర రూ.300 నుంచి రూ.450 వరకు మాత్రమే నిర్ణయిస్తున్నారని, గతంలో రూ.600 ల నుంచి రూ.800 వరకు ధరలు నిర్ణయించేవారన్నారు.

అధికారి మార్పుతో నాన్‌లోకల్ ఫీలింగ్

పలమనేరు పట్టుగూళ్ల వ్యాపారం జరిగే మార్కెట్‌లో పట్టు పరిశ్రమ శాఖ నుంచి విధులు నిర్వహించే మార్కెటింగ్ అధికారి అనిల్‌కుమార్ స్థానిక అధికార పార్టీ నేతలు, వ్యాపారులతో లాలూచీపడి లోకల్, నాన్ లోకల్ ఫీలింగ్ చూపుతున్నారని పట్టు రైతు అయ్యప్పనాయుడు ఆరోపిస్తున్నారు. గతంలో అక్కడ మార్కెటింగ్ అధికారిగా పనిచేసిన కిషోర్‌నాయక్ రైతులు తెచ్చిన పంట నాణ్యతను బట్టి ధరలు నిర్ణయించి ఎక్కడా సిండికేట్‌కు తావు లేకుండా చర్యలు తీసుకున్నారన్నారు.

అన్ని విధాలుగా ఆదుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం పట్టు సాగు రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలి. పట్టు సాగుకు అవసరమైన షెడ్ల నిర్మాణానికి భారీగా రాయితీ ఇవ్వాలి. రైతులకు మంచి చాకీ పురుగులను సరఫరా చేయాలి. పరిశుభ్రత, కూలీల అవసరాలకు తగినట్టుగా గిట్టుబాటు ధరలు కల్పించాలి. పట్టుగూళ్లకు నాణ్యత ఆధారంగా ధర కల్పించాలి. – అయ్యప్పనాయుడు, ప్రకృతి వ్యవసాయం సాగు రైతు, తిరుపతి రూరల్

రవాణా ఖర్చులు ప్రభుత్వం చెల్లించాలి



తిరుపతి జిల్లాలో పట్టు గూళ్ల క్రయ, విక్రయాలకు సంబంధించిన మార్కెట్ లేదు. పలమనేరు మార్కెట్‌కు వెళితే ధరలు గిట్టుబాటు కావడం లేదు. అంత దూరం పట్టుగూళ్లను తరలించాలంటే రవాణా ఖర్చులు భారీగా వస్తున్నాయి. ప్రభుత్వం రవాణా ఖర్చులు అదనంగా రైతులకు చెల్లిస్తే కొంత వరకు పట్టు సాగు రైతులకు ఊరట లభిస్తుంది. – పురంధర్, వెంకటత్తూరు గ్రామం, పిచ్చాటూరు మండలం

గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నాం



పట్టుగూళ్లకు రాయితీలు ఇచ్చి షెడ్లు నిర్మాణం చేయిస్తున్నారు.. మల్బరీ సాగులో తెగుళ్లు బారిన పడకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఆరోగ్యకరమైన పురుగులను పెంచుతూ నాణ్యమైన పట్టు గూళ్లను మార్కెట్‌కు తరలిస్తున్నాం. అయినా సరే దూరం నుంచి వచ్చారు కనుక తక్కువ రేటు పెట్టినా ఇచ్చేసి వెళతారని దారుణంగా ధరలు పెడుతున్నారు. మార్కెట్‌లో ఆ పరిస్థితి పోవాలి. – కనువేల్‌రెడ్డి, కొండలచెరువు గ్రామం, నారాయణవనం మండలం

ఎవరికీ ఇబ్బంది రాకుండా చూస్తాం

పలమనేరు మార్కెట్‌లో తిరుపతి జిల్లా నుంచి పట్టు గూళ్లు తీసుకువెళ్లే రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. మార్కెటింగ్ అధికారితో మాట్లాడి తారతమ్యం చూపకుండా చర్యలు తీసుకుంటాం. ఆవేశంతో సాగుకు దూరం కావద్దని మనవి చేస్తున్నా.
–కిషోర్‌నాయక్, పట్టుపరిశ్రమశాఖ అధికారి, తిరుపతి జిల్లా

మోదీ కనుసన్నల్లో రాజ్యాంగ సంస్థలు

- ఎన్నికల కమిషన్‌ది పూర్తి బాధ్యతారాహిత్యం
- రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మారిన చంద్రబాబు
- 12న పలాస భూములు సందర్శన, ఆందోళన
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

తిరుపతి కల్చరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాల్సింది పోయి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ పాలన సాగిస్తోందని, మోదీ కనుసన్నల్లో రాజ్యాంగ సంస్థలు సాగుతుండడం దుర్మార్గమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం కేవలం చంద్రబాబు, నితీష్ కారణంగా మనుగడ సాగిస్తోందన్నారు. అమెరికా అధ్యక్షుడు ప్రపంచ పోలీస్‌గా వ్యవహరిస్తున్నారని, ట్రంప్‌ను మోదీ ఇప్పటికీ వ్యతిరేకించడం లేదన్నారు. ట్రంప్ ఆర్థిక ఆంక్షల పేరుతో బ్లాక్ మెయిల్ చేస్తున్నా మోదీకి జ్ఞానోదయం కాకపోవడం దురదృష్టకరమన్నారు. సంచలనాత్మకంగా ప్రచారంలో ఉన్న దొంగ ఓట్ల జాబితా ఎన్నికల కమిషన్ నిర్లక్ష్య పనితీరుకు అద్దం పడుతోందన్నారు. గతంలోనే ఓట్ల చేర్పులు తొలగింపుపై తిరుపతిలో జరిగిన ఎన్నికల సందర్భంగా ఆధారాలతో సీపీఐ చూపించడం జరిగిందని, ప్రస్తుతం రాహుల్ గాంధీ జాతీయ స్థాయిలో నిరూపించారన్నారు. ఎన్నికల కమిషన్ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించలేదన్నారు. స్వతంత్ర సంస్థలుగా ఆపని చేయాల్సిన వ్యవస్థలు మోదీ నియంత్రణలోకి వెళ్లిపోయాయని ధ్వజమెత్తారు. ప్రజలకు పెనుభారంగా మారనున్న స్మార్ట్ మీటర్లు అమర్చితే దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రధాని మోదీ బీసీలలో పుట్టి వారికే మోసం చేస్తున్నారన్నారు. ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం కొత్త సీసాలో పాత సారా అన్న చందంగా పాలన సాగిస్తోందని విమర్శించారు. అమరావతిలో భూసేకరణ పేరుతో ప్రభుత్వం వ్యాపారాలు చేస్తున్నారన్నారు. మరోసారి భూసేకరణ చేయాల్సిన అవసరం ఏమిటన్నారు. శ్రీకాకుళంలో 1400 ఎకరాల భూమిని కార్గోకు అప్పగించేందుకు బాబు ప్లాన్ చేయడం దుర్మార్గమన్నారు. శ్రీకాకుళంలో ఈనెల 12న సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన, ప్రత్యక్ష పోరాటం చేస్తామని ప్రకటించారు.

నరసింహునికి తులసీదళాలతో ప్రత్యేక పూజలు


పూజలో పాల్గొన్న భక్తులు


పెంచలకోనలో బంగారు గరుడ వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహుడు

- పెంచకోనలో వైభవంగా శ్రావణ పౌర్ణమి వేడుకలు

రాపూరు: శ్రావణ పౌర్ణమి సందర్భంగా పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవిలకు శనివారం తులసీ దళార్చన పూజలు వైభవంగా నిర్వహించారు. లోకకల్యాణార్థం స్వామివారికి అత్యంత ప్రీతికరమైన తులసీ దళాలతో తులసీదళార్చన పూజా కార్యక్రమం నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి, ఆంజనేయస్వామికి ఉదయం సుప్రభాతం, అభిషేకం నిర్వహించారు. శ్రీవారి వారి నిత్య కల్యాణమండపంలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీ ఉత్సవమూర్తులను కొలువు దీర్చి, విశేషాలంకరణ చేసి, శ్రీవారి నందనంలోని ప్రత్యేక మండపంలో ఆశీయులను చేశారు. అక్కడ వేద పండితులు తులసిదళాలతో ప్రత్యేక పూజలు, ఆదిలక్ష్మీదేవికి కుంకుమార్చన సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి స్వామివారిని బంగారు గరుడ వాహనంపై కొలువు క్షేత్రోత్సవం నిర్వహించారు.


పెంచలకోనలో స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకులు

గీత దాటిన వెటర్నరీ వీసీ

- వర్శిటీ బోర్డు లేకుండానే పలు వివాదస్పద నిర్ణయాలు
- ఇన్‌చార్జ్‌లతో వర్సిటీలో పాలన అస్తవ్యస్తం

చంద్రగిరి: శ్రీవేంకటేశ్వర పశువైద్యవిశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ హద్దులు దాటి వ్యవహరిస్తున్నారు. కూటమి సర్కారు పూర్తి స్థాయి వీసీని నియమించకుండా రాష్ట్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. డీన్‌ల స్థాయి నుంచి అధికారుల వరకు గత ఏడాదిగా ఇన్‌చార్జ్‌ల పాలనే కొనసాగుతోంది. దీంతో నిబంధనలకు అనుగుణంగా పూర్తి స్థాయి నిర్ణయాలు తీసుకోలేక, గీతదాటి ఇన్‌చార్జ్‌లు వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటున్నారు. అధికారులు రాజకీయ వైషమ్యాలతో గ్రూపులుగా ఏర్పడి యూనివర్సిటీ ప్రతిష్టను దిగజార్చే పరిస్థితిని తీసుకొచ్చారు. పాలకమండలి లేకపోయినా ఇన్‌చార్జ్ హోదాలో అధికారులు వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడంపై విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

వర్సిటీలో రాజ్యమేలుతున్న కుట్ర రాజకీయాలు

గత ఏడాదిగా యూనివర్సిటీలో రాజకీయ కుట్రలతో పాలన అస్తవ్యస్తంగా మారింది. వర్సిటీలో అధికార స్థాయి పదవులన్నీ ఆ సామాజిక వర్గానికే చెందినవారే కావడంతో, రాజకీయాలు తప్ప వర్సిటీ అభివృద్ధిపై దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రార్ నియామకం

వెటర్నరీ యూనివర్సిటీలో ఆరు నెలల కాల వ్యవధితో బోర్డు అనుమతులు తీసుకుంటామంటూ రిజిస్ట్రార్‌ను నిబంధనలకు విరుద్ధంగా నియమించినట్లు సోమవారం రాత్రి ఆగమేఘాల మీద గుట్టుచప్పుడు కాకుండా ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జ్ వీసీకి కేవలం మూడు నెలల కాల వ్యవధితో మాత్రమే రిజిస్ట్రార్‌ను నియమించే నిబంధన ఉంది. అయితే రాజకీయ ఒత్తిళ్ల కారణంగానో లేక అవగాహన రాహిత్యంతోనో ఆరు నెలల కాల వ్యవధితో రిజిస్ట్రార్‌ను నియమించారు. ఆ హోదాకు అర్హులైన అధికారులు యూనివర్సిటీలో ఉన్నప్పటికీ గన్నవరం నుంచి ఓ ప్రొఫెసర్‌ను ఆ పదవికి దిగుమతి చేసుకోవడం ఏమిటో అర్థం కాలేదని యూనివర్సిటీలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఇన్‌చార్జ్ వీసీ తీసుకుంటున్న నిర్ణయాలతో ఇప్పటికే చాలా వరకు నష్టపోయామని, ఇకనైనా పాలనను గాడిలో పెట్టడానికి పాలకమండలితో పాటు శాశ్వత వీసీను నియమించాలని పలువురు కోరుతున్నారు.